సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.23
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,225 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.2°/21.4°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నిమజ్జనంలో అపశ్రుతి
- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన నరసింహమూర్తి

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని గువ్వలగుట్టపల్లిలో జరిగిన వినాయక నిమజ్జనంలో అపశ్రుతి దొర్లింది. నిమజ్జనానికి వినాయకుడిని తరలించే క్రమంలో విద్యుత్ వైర్లు విగ్రహానికి తగలకుండా పైకెత్తే సమయంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... గువ్వలగుట్టపల్లి చెందిన నరసింహమూర్తి(38) నిరుపేద. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. దీంతో కుటుంబ పోషణకు కదిరిలోని ఓ పెట్రోలు బంకులో పనిచేసేవాడు. వినాయక చవితి పండుగ కోసం మూడు రోజుల క్రితం స్వగ్రామం వచ్చాడు. శనివారం గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. యువకులందరితో పాటు ట్రాక్టర్‌లోకి ఎక్కి వినాయక విగ్రహానికి అడ్డు వచ్చిన విద్యుత్ లైన్లు కట్టె సాయంతో పైకెత్తేందుకు ప్రయత్నించాడు. అయితే నరసింహమూర్తి పట్టుకున్న కట్టె పచ్చిగా ఉండటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ఘటనతో ట్రాక్టర్‌పై ఉన్న యువకులు పైనుంచి కిందకు దూకేయడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం నరసింహమూర్తిని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించగా... అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలియగానే రూరల్ ఎస్‌ఐ లింగన్న సిబ్బంది పంపి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. నరసింహమూర్తి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు.

హలో అనగానే ఖాతాలో లక్ష మాయం


బాధితుడు శివకుమార్

తాడిపత్రిటౌన్: సెల్‌ఫోన్‌లో హలో అన్నాడో లేదో క్షణాల్లో బ్యాంకు ఖాతా నుంచి రూ. లక్ష మాయమైంది. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన శివకుమార్ వినాయక పండుగకు అత్తగారి గ్రామమైన తాడిపత్రికి వచ్చాడు. రెండు రోజుల క్రితం వాట్సాప్‌లో గుర్తు తెలియని నంబర్ నుంచి గుడ్ మార్నింగ్ అంటూ మెసేజ్ రాగా.. శివకుమార్ స్పందించలేదు. సాయంత్రం మళ్లీ అదే నంబర్ నుంచి వాట్సాప్ కాల్ రాగా.. పొరపాటున లిఫ్ట్ చేశాడు. అవతలి వైపు నుంచి ఎవరూ మాట్లాడకపోవడంతో కాల్ కట్ చేశాడు. ఈ క్రమంలోనే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.1,04,330 కట్ అయినట్లు మెసేజ్ రావడంతో శివకుమార్ హతాశుడయ్యాడు. వెంటనే తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాదాపు 5 దఫాలుగా డబ్బు మాయమైనట్లు వాపోయాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ
అనంతపురం: గ్రామీణ నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ వర్క్స్ (జరీ), ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. సెప్టెంబర్ 10, 15, 16 తేదీల్లో ఆయా బ్యాచ్‌లకు శిక్షణ మొదలవుతుందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని వెల్లడించారు. 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసుండి, చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 96188 76060, 94925 83484 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కబ్జాల ఖల్‌నాయక్



- పెడపల్లిలో టీడీపీకి చెందిన ఓ 'నాయక్' భూదందా
- నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ భూముల ఆక్రమణ
- భవనాలు నిర్మించి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వైనం
- రాజకీయ ఒత్తిళ్లతో ఎలాంటి చర్యలూ తీసుకోని అధికారులు
- నకిలీ డాక్యుమెంట్లతో బంధువుల పేరిట భవనాల రిజిస్ట్రేషన్



ఈ భవనం పెడపల్లి గ్రామం నుంచి నిడిమామిడి వెళ్లే రోడ్డులో ఉంది. 157–2తో పాటు 157–3 సర్వే నంబర్లలోని 4 సెంట్ల స్థలాన్ని టీడీపీ పెద్దల అండతో ఓ 'ఖల్ నాయక్' ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టాడు. ఈ స్థలానికి వేరే సర్వే నంబర్లు వేసి నకిలీ పట్టాలు సృష్టించి.. బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నట్లు తెలిసింది.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జిల్లా కేంద్రం పుట్టపర్తికి సమీపాన ఉన్న పెడపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. కూటమి పార్టీల నాయకులు ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. మామూళ్లు ఇచ్చి.. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకుంటారు. ఆ తర్వాత సర్వేనంబర్లు మార్చి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. రిజిస్ట్రేషన్ కూడా చేసుకుంటున్నారు. ఆ తర్వాత సదరు భూమిపై సర్వ హక్కులూ ఉన్నాయంటూ భవనాలు నిర్మిస్తున్నారు. వంక పోరంబోకు భూములతో పాటు గిరిజనుల కర్మకాండలకు కేటాయించిన భూములను సైతం కాజేశారు. అంతటితో ఆగకుండా డిజిటల్ లైబ్రరీకి కేటాయించగా.. మిగులు భూమిలో దర్జాగా భవనాలు సైతం నిర్మించారు.

'పచ్చ' నేతకే మేత

పెడపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన ఓ సీనియర్ నేత ప్రభుత్వ భూములను కబ్జా చేశాడు. ఏళ్లుగా ఆ గ్రామంలోని భూములను విడతల వారీగా ఆక్రమిస్తూ 'కబ్జాల ఖల్ నాయక్'గా పేరుగాంచాడు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని.. అధికారులను నోర్లు మూయించి ప్రభుత్వ భూములన్నీ సొంతం చేసుకుంటున్నాడు. రాజకీయ ఒత్తిళ్లు ఉండటంతో అధికారులు సైతం ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. కనీసం విచారణ చేసి నిజానిజాలు రాబట్టేందుకు కూడా జంకుతున్నారు. ఎవరైనా కబ్జాల గురించి ఆరా తీసినా, రికార్డులు వెతికినా వెంటనే సదరు అధికారికి పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఓ మాజీ మంత్రి నుంచి ఫోన్ వెళ్తుంది. దీంతో పోస్టింగ్ భయంతో అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోయినట్లు తెలుస్తోంది.

బ్యాంకుల్లో రుణాలు పొంది..

పెడపల్లికి చెందిన కబ్జాల ఖల్ నాయక్ తొలుత ప్రభుత్వ భూములను ఆక్రమిస్తాడు. అనంతరం తన బంధువుల పేరిట పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్ సైతం పూర్తి చేస్తాడు. ఆ తర్వాత దర్జాగా భవనాలు నిర్మిస్తాడు. ఆ నిర్మాణాలను చూపి బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకుంటాడు. ఇలా ఇప్పటికే చాలా ప్రాంతాల్లో భూములు ఆక్రమించి భవనాలు నిర్మించి బ్యాంకుల నుంచి లోన్లు తీసుకున్నాడు. ఈ పచ్చ నేతకు మాజీ మంత్రి అండదండలు ఉండటంతో కబ్జాల పర్వం తెలిసినా ఎవరికీ ఫిర్యాదు చేయలేని స్థితిలో గ్రామస్తులు ఉన్నారు. ఇక అధికారులకు తెలిసినా.. పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పెడపల్లిలో ఖల్ 'నాయక్' కబ్జా చేసిన ప్రభుత్వ భూముల వివరాలు ఇలా..

- సర్వేనంబర్ 148–1లోని కొంత స్థలం. ఇప్పుడు అక్కడ ఓ భవన నిర్మాణం జరిగింది.
- సర్వేనంబర్ 148–2 లో గిరిజనుల కర్మకాండ కోసం కేటాయించిన 17 సెంట్లు. అందులో చాలా భాగం ఆక్రమించారు.
- సర్వేనంబర్ 157–2లోని కొంతస్థలం, సర్వేనంబర్ 157–3లోని కొంతస్థలాన్ని ఆక్రమించి అందులో బిల్డింగ్ నిర్మాణం.
- సర్వే నంబరు 564లో తోపు పోరంబోకు 2.30 ఎకరాలు ఉండగా.. జగనన్న కాలనీ తర్వాత షాదీ మహల్‌కు భూమి కేటాయించాక.. మిగిలిన 5 సెంట్ల కోసం మాన్యువల్ పట్టా సృష్టించి.. నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్టర్ చేసుకున్నారు.

కేసుల్లోనూ ఘనుడే..

పెడపల్లికి చెందిన 'ఖల్ నాయక్'పై గతంలో చాలా కేసులున్నాయి. పేకాట, క్రికెట్ బెట్టింగ్ ఆడించడంలో దిట్ట. గతంలో పలుమార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. చుట్టుపక్కల తండాల పరిధిలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా కర్ణాటక మద్యం, నాటు సారా సైతం విక్రయిస్తున్నట్లు తెలిసింది.


ఆక్రమణకు గురవుతున్న గిరిజనుల కర్మకాండకు ఇచ్చిన స్థలం

చంటి బిడ్డతో వేచివున్నా.. ఆపని బస్సులు


బస్సును అడ్డుకుని డ్రైవర్‌ను మందలిస్తున్న స్థానికులు

బత్తలపల్లి: బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం ఉదయం 11.30 గంటలకు ఓ మహిళ చంటి బిడ్డతో ధర్మవరం వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డుపైనే ఎండలో వేచి ఉంది. బస్సులు ఒకదాని వెంట మరొకటి వస్తున్నాయి. వచ్చిన ప్రతి బస్సునూ ఆ మహిళ ఆపేందుకు చేయి ఎత్తుతోంది. బస్సు డ్రైవర్లు మాత్రం చూసి కూడా ఆపకుండానే వెళ్లిపోతున్నారు. ఫ్రీ టికెట్.. ఎందుకు ఆపాలని అనుకున్నారో ఏమో..చంటి బిడ్డతో వేచి ఉందన్న కనీస మానవత్వం కూడా లేకుండానే వెళ్లిపోయారు. ఇలా ఐదు బస్సులు వెళ్లాయి. అప్పటికి 12 గంటలు అయింది. చివరికి అక్కడున్న వారికి ఈ తతంగం ఆగ్రహం తెప్పించింది. ఆ సమయంలో ధర్మవరం డిపోకు చెందిన ధర్మవరం–పులివెందుల బస్సు వచ్చింది. ఆ బస్సు కూడా ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు ద్విచక్ర వాహనంలో వెంబడించారు. జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద బస్సును అడ్డుకున్నారు. డ్రైవర్‌తో ఘర్షణకు దిగారు. ఓ మహిళ చంటి బిడ్డతో ఎండలో ఉందన్న మానవత్వం కూడా లేకుండా ఎలా వెళ్లిపోతారంటూ నిలదీశారు. తర్వాత ఆ మహిళను బస్సులో ఎక్కించి పంపించారు. మహిళలకు ఎలాగూ ఫ్రీనే కదా అనే ఉద్దేశంతో చాలావరకు బస్సులు ఆపడంలేదని పలువురు తెలిపారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


రమేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ

బత్తలపల్లి: అప్పుల బాధ తాళలేక ఓ చేనేత కార్మికుడు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బత్తలపల్లి ఏఎస్‌ఐ సోమశేఖరమూర్తి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన లక్ష్మన్న కుమారుడు చిట్రా రమేష్(34) ఇంట్లోనే చేతి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ముడి సరుకులు ధర పెరగడంతో కూలి గిట్టుబాటుకాక జీవనం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం లేకపోవడంతో కుటుంబ పోషణకు రమేష్ తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. వడ్డీలతో కలిపి అప్పు మొత్తం పెరుగుతుండగా...తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మగ్గం పక్కనపెట్టిన రమేష్ గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటున్నాడు. కూలి డబ్బులు కుటుంబ పోషణకే సరిపోతుండటంతో అప్పులు తీర్చలేక ఇబ్బందిపడేవాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించక జీవితంపై విరక్తి చెందిన రమేష్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉన్న ఇనుప దూలానికి చీరతో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వచ్చిన కూతురు దూలానికి వేలాడుతున్న రమేష్‌ను చూసి బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వచ్చి చీరను కోసి రమేష్‌ను కిందకు దించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు గమనించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ సోమశేఖరమూర్తి సిబ్బందితో గ్రామానికి చేరుకుని మృతుని భార్యతో వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మీదేవితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బార్ టెండర్లలో సిండికేటు

పక్కా ప్లాన్... దరఖాస్తులు పరిమితం

- నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామనే నిబంధన
- ఆరు బార్లకు నాలుగు చొప్పునే దరఖాస్తులు అందిన వైనం
- ఐదు బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాక లాటరీ వాయిదా


మద్యం దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్ చేతన్

సాక్షి, పుట్టపర్తి: నూతన మద్యం పాలసీ ద్వారా బార్లకు లైసెన్సులు ఇచ్చి.. మరింత ఆదాయం పెంచాలని భావించిన కూటమి సర్కారుకు ఎదురు దెబ్బ తగిలింది. కూటమి పార్టీల నాయకులే సిండికేటుగా మారి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. బార్లకు ఇతరులను దరఖాస్తు చేయనీయకుండా అడ్డుకున్నారు.

ఐదు బార్లకు లాటరీ వాయిదా..

జిల్లాలో మొత్తం 12 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో ఒక బార్‌ను కల్లుగీత కార్మికులకు కేటాయించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షలతో పాటు ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలుగా నిర్ణయించారు. దీంతో భారీగా దరఖాస్తులు అందుతాయని అందరూ భావించారు. అయితే కూటమి నేతలు దరఖాస్తు చేసేందుకు ఉత్సాహం చూపిన పలువురిని బెదిరించారు. దీంతో కూటమి నేతల కనుసన్నల్లోనే టెండర్లు నడిచినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పక్కా ప్లాన్‌తో సిండికేటుగా మారిన కూటమి నేతలు పరిమితంగానే దరఖాస్తులు చేశారు. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ తీస్తామని నిబంధనలు విధించడంతో ఆరు బార్లకు నాలుగు చొప్పున మాత్రమే దరఖాస్తులు చేశారు. దీంతో పక్కా ప్లాన్ ప్రకారమే టెండర్లలో పాల్గొన్నట్లు స్పష్టం అవుతోంది. మిగతా ఐదుబార్లకు ఒక్కటంటే ఒక్క దరఖాస్తూ రాలేదు. దీంతో ఆ ఐదు బార్లకు లాటరీ వాయిదా వేశారు. ఇక కల్లుగీత కార్మికులకు రిజర్వు చేసిన బార్‌కు గరిష్ఠంగా 11 మంది పోటీ పడటం విశేషం.

లాటరీ తీసిన కలెక్టర్..

మొత్తం 7 బార్లకు 35 మంది పోటీ పడగా.. లాటరీ విధానంలో ఎంపిక చేశారు. శనివారం ఉదయం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో కలెక్టర్ టీఎస్ చేతన్ లాటరీ ద్వారా బార్లు కేటాయించారు. సక్సెస్‌ఫుల్ అప్లికెంట్, ఆర్–1, ఆర్–2 చొప్పున ఒక్కో బార్‌కు ముగ్గురిని ఎంపిక చేశారు. మొదటి వారు డబ్బులు చెల్లిస్తే సరిపోతుంది. ఒకవేళ సదరు వ్యక్తి ముందుకు రాకుంటే మరో వ్యక్తి.. ఆయన రాకుంటే ఇంకొకరు చొప్పున ముగ్గురిని ఎంపిక చేశారు.

- కల్లుగీత కార్మికులకు ఒక బార్ రిజర్వు చేయగా... హిందూపురంలో కేటాయించారు.
- ధర్మవరంలో మూడు బార్లకు గానూ.. కేవలం ఒకబార్‌కు మాత్రమే దరఖాస్తులు వేశారు. మిగతా రెండింటికి ఒక్క దరఖాస్తు అందలేదు.
- హిందూపురంలో మూడు బార్లకు గానూ రెండు బార్లకు దరఖాస్తులు అందాయి. మరో బార్‌కు ఎవరూ దరఖాస్తు చేయకుండా అడ్డుకున్నట్లు సమాచారం.
- కదిరిలో మూడు బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా.. రెండింటికి మాత్రమే దరఖాస్తులు అందాయి. మరో బార్‌కు దరఖాస్తు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు.
- పెనుకొండలో ఒక బార్‌కు నోటిఫికేషన్ ఇవ్వగా.. కేవలం నలుగురు మాత్రమే పోటీ పడ్డారు. ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా అడ్డుకున్నట్లు తెలిసింది.
- మడకశిరకు ఒక బార్ రాగా... కర్ణాటక వాళ్లతో కూటమి నేతలు సిండికేట్ అయినట్లు సమాచారం. దీంతో ఒకరు కూడా దరఖాస్తు చేసేందుకు ముందుకు రాలేదని తెలిసింది.

పారదర్శకంగా బార్ల కేటాయింపు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని బార్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి పారదర్శంగా చేపట్టినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక సాయిఆరామంలో జిల్లాలోని 6 బార్లకు ఓపెన్ లాటరీ తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... నిబంధనల మేరకు దరఖాస్తులు అందిన మొత్తం 7 బార్లకు (కల్లుగీత కార్మికులకు రిజర్వ్ చేసిన బార్‌తో కలిపి) 35 మంది పోటీ పడ్డారన్నారు. అందరి సమక్ష్యంలో లాటరీ తీసి బార్లు కేటాయించామన్నారు.

బార్లకు అందిన దరఖాస్తులు ఇలా...

బార్ నంబర్	దరఖాస్తుల సంఖ్య
1	4 (హిందూపురం)
2	0 (హిందూపురం)
3	4 (హిందూపురం)
4	4 (ధర్మవరం)
5	0 (ధర్మవరం)
6	0 (ధర్మవరం)
7	0 (కదిరి)
8	4 (కదిరి)
9	4 (కదిరి)
10	4 (పెనుకొండ)
11	0 (మడకశిర)
12	11 ఈడిగ (హిందూపురం)

రీ నోటిఫికేషన్ ఇస్తాం

నిబంధనల మేరకు ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలి. కానీ జిల్లాలో ఐదు బార్లకు నాలుగులోపే దరఖాస్తులు అందాయి. దీంతో ఆయా బార్లకు త్వరలోనే రీ–నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించాం. మిగిలిన వాటిని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన పారదర్శకంగా కేటాయించాం.

– గోవింనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి


హిందూపురం ముదిరెడ్డిపల్లిలో వినాయక శోభాయాత్ర


వినాయక నిమజ్జనం సందర్భంగా ఎన్‌పీకుంటలో ఉట్టికొడుతున్న చిన్నారి


పుట్టపర్తిలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు


శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న ముదిరెడ్డిపల్లి చిన్నారులు, మహిళలు


ధర్మవరం చెరువు వద్ద చిన్నారుల సందడి

గంగ ఒడికి గణనాథుడు

'గణపతి బప్పా మోరియా... గణేష్ మహరాజ్‌కీ జై' అంటూ యువతీ, యువకులు సందడి చేశారు. రంగులు చల్లుకుంటూ ఉత్సాహంతో ఆడిపాడారు. 'జై జై గణేశ జై కొడత గణేశ' అంటూ నృత్యాలతో హోరెత్తించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన గణేష్ నిమజ్జనం అట్టహాసంగా సాగింది. మేళతాళాలు, డప్పు దరువులతో పిల్లాపెద్ద చిందులేస్తూ గౌరీ పుత్రుడిని గంగ ఒడికి చేర్చారు. నిమజ్జనం సందర్భంగా పలుచోట్ల అన్నదానం చేశారు. లడ్డూ వేలాలు ఆసక్తిగా సాగాయి.

– సాక్షి బృందం

క్లుప్తంగా

12 నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

బత్తలపల్లి: రామాపురంలో సెప్టెంబర్ 12 నుంచి పదో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన బత్తలపల్లిలో మీడియాకు వివరాలు వెల్లడించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామపెద్దల సహకారంతో మూడు రోజులపాటు రామాపురం ఉన్నతపాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లు పాల్గొంటాయన్నారు. 11వ తేదీ నాటికి జట్లన్నీ రామాపురం చేరుకుంటాయన్నారు. పోటీల నిర్వహణకు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

పురాతన గుడి ధ్వంసం



గుడి లోపలి భాగం

పుట్టపర్తి: బుక్కపట్నం లింగప్పగారిపల్లి వద్ద పురాతన వెంకటేశ్వర స్వామి గుడిని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గుడి లోపల తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు శనివారం దేవదాయ శాఖ అధికారులతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుప్త నిధుల కోసం ఏమైనా తవ్వకాలు చేపట్టారేమోనన్న అనుమానాలు వ్యక్తం చేశారు.

పట్టపగలే చోరీ




చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

గాండ్లపెంట: పాలవాండ్లపల్లిలో పట్టపగలే చోరీ జరిగింది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలవాండ్లపల్లికి చెందిన జి.వాసుదేవ అనే యువకుడు వ్యవసాయం, పాడి పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఊరికి చివరన గల ఇంటిలో తల్లితో కలిసి నివసిస్తున్నాడు. ఇటీవల ఆవులు, పేడ విక్రయించగా వచ్చిన రూ.5లక్షల నగదును బీరువాలో భద్రపరిచి ఉంచాడు. ఇక తనకు సంబంధం కుదిరితే పెళ్లి చేసుకుందామని భావించాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి తల్లీ కొడుకు ఆవులను మేతకోసం పొలానికి తీసుకెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. భద్రపరచిన డబ్బు కనిపించలేదు. జరిగిన ఘటనపై వాసుదేవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది శనివారం గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి

● అథఃపాతాళానికి పడిపోయిన ధరలు ● పట్టించుకోని కూటమి ప్రభుత్వం ● లబోదిబోమంటున్న రైతులు



గుమ్మఘట్ట: ఉల్లి ధరలు దారుణంగా పతనమయ్యాయి. ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పంట పండించిన రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని లబోదిబోమంటున్నారు. జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఐదు వేల ఎకరాల విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశారు. ఇందులో ఒక్క గుమ్మఘట్ట మండలంలోనే 2,500 ఎకరాల్లో ఉల్లి సాగు చేయడం గమనార్హం. విత్తనం, ఎరువులు, కలుపు తీత కూలితో సహా ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు అథః పాతాళానికి పడిపోయాయి. క్వింటాలు ధర రూ.600కు మించడంలేదు. గిట్టుబాటు ధరతో ఉల్లిని కొనుగోలు చేయడానికి కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. బెంగళూరు, రాజమండ్రి, కర్నూలు, కోల్‌కతా మార్కెట్‌లకు తీసుకెళ్లినా సరైన ధర లేకపోవడంతో అమ్ముకోలేక.. వెనక్కు తీసుకురాలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడిగేనాథులే లేరు

ఉల్లి పంట బాగా పండింది. ఈసారి అప్పులు తీరుతాయని కుటుంబ సభ్యులంతా సంతోషపడ్డాం. అయితే పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. ఉల్లి కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాలేని పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చేలా లేవు. మళ్లీ అప్పుల ఊబిలోకి కూరుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మా తలరాతలు ఎప్పుడు మారతాయో అర్థం కావడం లేదు.

– రామాంజిని, రైతు, పూలకుంట

రైతులను ఆదుకోవాలి



బోరుబావుల కింద రెండు ఎకరాల్లో ఉల్లి పంట వేశాను. మంచి దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పంటకు పెట్టిన ఖర్చులు కూడా తిరిగి రాకపోతే ఎలా బతికేది. గిట్టుబాటు ధర ప్రకటించి.. మార్కెటింగ్ సదుపాయం కల్పించి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– దయానందరెడ్డి, రైతు, ఆర్.కొత్తపల్లి

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



ఉల్లికి కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి.. రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేయాలి. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించి ఆదుకోవాలి. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే ఉల్లి పంటను కొనుగోలు చేసి.. రైతులకు భరోసా కల్పించింది.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

అలరించిన సాంస్కృతిక వైభవం





చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలోని ఘట్టాలు

ప్రశాంతి నిలయం: భగవాన్ సత్యసాయిబాబా ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతూ.. మానవతా విలువలు వివరిస్తూ సాయి విద్యాసంస్థల చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్త కోటిని పరవశభరితులను చేశాయి. దేశ వ్యాప్తంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, సత్యసాయి సేవా సంస్థల నేతృత్వంలో నిర్వహిస్తున్న 103 పాఠశాలలకు చెందిన 2,400 మంది విద్యార్థులు ప్రశాంతి నిలయానికి తరలివచ్చి సత్యసాయి మహాసమాధి చెంత శ్రీసత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ స్కూల్ ఆధ్వర్యంలో కృతజ్ఞతా పూర్వక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి గురుకులం బెజ్జంకి, శ్రీసత్యసాయి విద్యా విహార్ విశాఖపట్నంకు చెందిన విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. సూరత్‌కు చెందిన శ్రీసత్యసాయి స్కూల్ విద్యార్థులు గరాబ్ నృత్యం ప్రదర్శించారు. హర్యానాకు చెందిన శ్రీసత్యసాయి జాగృతి విద్యా మందిరం విద్యార్థులు బాంగ్రా నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం ఒడిశాలోని పార్లాక్కెముండి గజపతి జిల్లాకు చెందిన శ్రీసత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు.

వ్యసనాలకు అలవాటుపడి.. దొంగగా మారి



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యబాబు

పుట్లూరు: వ్యసనాలు ఆ యువకుడిని దొంగగా మార్చాయి. చోరీలు చేస్తూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ సత్యబాబు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల కేంద్రం పుట్లూరులోని బీసీ కాలనీలో ఈ నెల 22న చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీలు జరిగిన తీరు, పాత నేరస్తుల కదలికలతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టారు. బీసీ కాలనీకి చెందిన దాసప్పగారి బాలచంద్ర అలియాస్ బాలును అనుమానితునిగా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బీసీ కాలనీలో జరిగిన చోరీతో పాటు గ్రామంలోని జనరల్ స్టోర్‌లో జరిగిన దొంగతనం కూడా బాలునే చేసినట్లు విచారణలో తేల్చారు. కూలి పనులు చేసుకునే ఇతడు ఆన్‌లైన్ గేమ్, పేకాట తదితర జూదాలకు డబ్బు అవసరమై దొంగతనాల బాట ఎంచుకున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు బాలును శనివారం అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మూడు జతల బంగారు కమ్మలు, 8 గ్రాముల చైన్, రెండు ఉంగరాలు, 25 తులాల వెండి గొలుసులతో పాటు జనరల్ స్టోర్‌లో చోరీ చేసిన రూ.7,450 నగదును రికవరీ చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో యల్లనూరు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, ట్రైనీ ఎస్‌ఐలు రామక్రిష్ణ, సురేష్, కానిస్టేబుళ్లు వెంకటేష్, షెక్షావలి, నరేష్, రాము, రమేష్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



హరియాన్‌చెరువు సర్వే రిజిష్టర్లను పరిశీలిస్తున్న డీపీఓ సమత

చెన్నేకొత్తపల్లి: గ్రామ కంఠం, ఇంటి స్థలాలకు యాజమాన్య హక్కు కల్పించేందుకు చేపట్టిన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డీపీఓ సమత సిబ్బందికి సూచించారు. న్యామద్దెల పంచాయతీ హరియాన్‌చెరువు గ్రామంలో జరుగుతున్న సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమంత్, వెంకటేష్, గ్రామ సర్వేయర్ వినోద్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ : చెన్నేకొత్తపల్లి సచివాలయం -1ను డీపీఓ సమత ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్‌నాయక్‌తో కలసి తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. పన్నులు, పారిశుధ్యం, ఇంటింటి చెత్త సేకరణ తదితర పనుల గురించి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో దోమలు పెరిగి జ్వరాలు పెరిగే ప్రమాదం ఉందని, కావున ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు.

తప్పనిసరిగా హాజరు కావాలి



మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

గోరంట్ల: గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ల కాంప్లెక్స్ సమావేశాలను శనివారం డీఈఓ కిష్టప్ప పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఉపాధ్యాయులు తప్పకుండా హాజరై అన్ని విషయాలు చర్చించి పాఠశాలలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు సెలవు పెట్టుకోకూడదన్నారు. టీచర్ డైరీ అసైన్మెంట్ బుక్‌లెట్‌లను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. వెనుకబడిన పిల్లలకు రెమిడియల్ క్లాసెస్ నిర్వహించి వారిని తరువాత జరిగే పరీక్షలకు సమాయాత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రెడ్డెప్పతోపాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

కదిరి అర్బన్: యాకాలచెరువుపల్లిలో ఈ నెల 29న గణేశ్ నిమజ్జనం సందర్భంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఇరు వర్గాలకు చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి శనివారం తెలిపారు.

ఎట్టకేలకు ఎరువులు వచ్చాయ్

అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు శనివారం అనంతపురం చేరాయి. రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) కంపెనీ నుంచి వచ్చిన ఎరువులకు స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌తో పాటు విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్ తదితరులు పరిశీలించారు. 500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా.. అందులో మార్క్‌ఫెడ్ 350 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ హోల్‌సేల్‌డీలర్లకు 150 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు ఏడీఏ తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లాకు 388 మెట్రిక్ టన్నులు కాగా.. శ్రీసత్యసాయి జిల్లాకు 112 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తామని వెల్లడించారు. ఇక 15–15–15 రకం కాంప్లెక్స్ ఎరువులు 854 మెట్రిక్ టన్నులు రాగా.. అందులో అనంతపురం జిల్లాకు 574 మెట్రిక్ టన్నులు, శ్రీసత్యసాయి జిల్లాకు 280 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలతో పాటు ప్రైవేట్ డీలర్ల దగ్గర తగినంత యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు.

ఇద్దరికి ప్రొఫెసర్లుగా పదోన్నతి



డాక్టర్ రాజేష్,



డాక్టర్ శారద

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రొఫెసర్ పోస్టులకు కౌన్సెలింగ్ జరిగింది. కాగా ఈఎన్‌టీ విభాగానికి సంబంధించి అసోసియేట్ ప్రొఫెసర్, ప్రస్తుత ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీగా ఉన్న డాక్టర్ రాజేష్‌కుమార్‌కు, మానసిక వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ శారదకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా తోటి వైద్యులు, కింది స్థాయి సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు. వీరిద్దరికీ ప్రొఫెసర్లుగా అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే పోస్టింగ్ వచ్చింది.

డ్రిప్ పరికరాలు అందించండి



మాట్లాడుతున్న పీడీ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: ఈ ఆర్థిక సంవత్సరాని(2024–25)కి సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను వారంలోపు అందించాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం పీడీ తన కార్యాలయంలో 23 డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలను అందించే ఏజెన్సీ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12,044 హెక్టార్లకు సంబంధించి రైతులకు పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ పరికరాలను వారం లోపు అందించి ఇన్‌స్టలేషన్ పూర్తి చేయాలన్నారు. ఇక 2025–26సంవత్సరానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. డీడీ (లింక్ ద్వారా) తీసుకొని ఎస్టిమేషన్ వేసి అప్రూవల్‌కు పంపాలన్నారు. రైతుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ డీడీలు స్వీకరించకుండా కేవలం లింక్ ద్వారానే డీలర్‌కు పంపాలన్నారు.

వైద్య విద్య కార్యక్రమాలతో నూతన ఆవిష్కరణలు



మైక్రో బయాలజీ సీఎంఈకి హాజరైన అధ్యాపక బృందం

అనంతపురం మెడికల్: నిరంతర వైద్య విద్య కార్యక్రమాల ద్వారా నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మైక్రో బయాలజీ విభాగానికి సంబంధించి సీఎంఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైద్య కళాశాలలో యూజీ, పీజీ సీట్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. వైద్యులు నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, ప్రొఫెసర్ శాంతిరెడ్డి, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశా.. గోవిందా



ఖాద్రీశుని దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. కదిరి పరిసర ప్రాంతాలతో పాటు కడప, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు భారీగా తరలిరావడంతో ఆవరణ కిటకిటలాడింది. స్వామి దర్శనానికి ఉదయమే భక్తులు బారులు తీరడంతో క్యూలైన్ ఆలయ ఆవరణ దాటి పోయింది. వచ్చిన భక్తులందరికీ స్వామి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. దూర ప్రాంత భక్తులు ఇబ్బందులు పడకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భర్త, కుమారుడు అదృశ్యం

అనంతపురం: తన భర్త, కుమారుడు అదృశ్యమయ్యారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. శారదనగర్‌లో నివాసముంటున్న ఎం.అరుణజ్యోతి ఓ ప్రైవేట్ స్కూలులో పనిచేస్తోంది. ఈమెకు 2021లో కనగానపల్లి మండలం కొండపల్లికి చెందిన కె.గంగాధర్(జెడ్పీలో వర్క్ ఇన్‌స్పెక్టర్)తో వివాహమైంది. వీరికి కూతురు యోగశ్రీ, కొడుకు విశ్రుత్ సంతానం. అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండటంతో అరుణజ్యోతి గత ఏడాది ఏప్రిల్‌లో మెట్టినింటి నుంచి పిల్లలతో సహా పుట్టింటికి వచ్చేసింది. అయినా భర్త ప్రవర్తనలో మార్పు లేకపోగా.. అదనపు కట్నం వేధింపులు మరింత పెరిగిపోవడంతో భరించలేకపోయిన ఆమె ఈ నెల 28న మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో విచారణ నిమిత్తం వచ్చిన భర్త స్టేషన్ బయట కుమారుడితో ఆడుకుంటూ ఉన్నాడు. అరుణజ్యోతి స్టేషన్‌లోకి వెళ్లి బయటకు వచ్చేలోపు భర్త, కుమారుడు కనిపించ లేదు. భర్తకు ఫోన్ చేస్తే సెల్ స్విచాఫ్ వచ్చింది. దీంతో కొండపల్లికి వెళ్లి విచారణ చేస్తే అత్తమామలు తమకు తెలియదని చెప్పారు. తన భర్త, కుమారుడి ఆచూకీ కనిపెట్టాలని అరుణజ్యోతి శనివారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అదృష్టం తలుపు తట్టినా.. దురదృష్టం వెంటాడింది!

- టీచరు పోస్టుకు ఎంపికైనా గడువులోగా విద్యార్హత సర్టిఫికెట్లు లేనికారణంగా తిరస్కరణ
- ముగ్గురు అభ్యర్థుల నుంచి నాట్‌విల్లింగ్ తీసుకున్న అధికారులు
- మరో ముగ్గురు అభ్యర్థుల దరఖాస్తుల తిరస్కరణ
- పూర్తయిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: వేలాదిమంది పోటీపడినా ప్రతిభ చాటి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికయ్యాడు. సంబంధిత బీపీఈడీ కోర్సు గడువులోపు పూర్తి చేయని కారణంగా అనర్హుడిగా ప్రకటించారు. తొలిరెండు రోజులు గైర్హాజరు అయిన వారి కోసం మూడోరోజు శనివారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగించారు. మొత్తం 787 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. వీరిలో 748 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. తక్కిన 9 మందిని పిలిపించి అర్హులా కాదా? అని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో ఆ 9 మంది అభ్యర్థులను పిలిపించారు. వీరిలో ముగ్గురు శ్రీకాంత్, లక్ష్మీదేవి, శ్రీనివాసులు సర్టిఫికెట్లు జత చేయడంతో అప్‌లోడ్ చేశారు. దాసరి మహేష్‌కుమార్ అనే అభ్యర్థి ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికయ్యాడు. అయితే ఈయన మార్చి 15 నాటికి బీపీఈడీ కోర్సు సర్టిఫికెట్లు లేవు. ఆగస్టులో ఉత్తీర్ణత సాధించాడు. ఈ కారణంగా అనర్హత వేటు వేశారు. అలాగే మరో అభ్యర్థి చంద్రమౌళి పీహెచ్ కోటాలో ఎంపికయ్యాడు. సర్టిఫికెట్‌లో వైకల్య శాతం తక్కువగా ఉన్న కారణంగా తిరస్కరించారు. ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికైన కొండమ్మ... కేజీబీవీలో పని చేస్తూ బీపీఈడీ కోర్సు చేశారు. ఫిర్యాదు అందిన కారణంగా సంబంధిత సర్టిఫికెట్లు (బీపీఈడీ కోర్సు చేస్తున్న సమయంలో కేజీబీఓలో పని చేస్తూ జీతం తీసుకున్నట్లు) తెప్పించుకుని పరిశీలించి ఆమెపై అనర్హత వేటు వేశారు. ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికైన జి.వెంకటరమణ, ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ఎంపికైన మరో అభ్యర్థి హనుమంతరాయప్ప, ఇంకో అభ్యర్థి రామకృష్ణప్రసాద్ వీరిముగ్గురూ నాట్ విల్లింగ్ ఇచ్చారు. నాట్ విల్లింగ్, అర్హత లేని వారి మొబైళ్లకు ఓటీపీలు పంపి తద్వారా ఆయా పోస్టులకు అనర్హులుగా ధ్రువీకరించారు.

ఇంకా 50 పోస్టుల సమాచారం ఏదీ?

జిల్లాలో మొత్తం 807 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. మూడు రోజులుగా 757 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. తక్కిన 50 పోస్టుల సంగతేంటనే దానిపై ఇక్కడి అధికారులకు స్పష్టత లేదు. 757 మందిలో ఏ కేటగిరీ పోస్టులకు ఎంతమంది వచ్చారనే సమాచారం కూడా వీరి వద్ద లేదు. అభ్యర్థులు పేర్లు, ఐడీఉ, తండ్రిపేరు, ఫోన్‌నంబరు తదితర వివరాలు తప్ప వారు ఏసబ్జెక్టు అనే వివరాలు కల్గిన జాబితాలు ఎక్కడా కనిపించవు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో వారికి కేటాయించిన టీం వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో అభ్యర్థి ఐడీ ఎంటర్ చేస్తే అక్కడ మాత్రమే ఈ పోస్టుకు అర్హుడని కనిపిస్తోంది. వ్యక్తిగత సమాచారం తప్పితే పూర్తి వివరాలు కల్గిన అందరి జాబితా తమకు అందలేదని అధికారులు చెబుతున్నారు. అనర్హులు, నాట్‌విల్లింగ్ ఇచ్చిన అభ్యర్థులకు సంబంధించి అదే కేటగిరీలో తర్వాత ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇస్తారని దీనిపై రాష్ట్ర అధికారులే స్పష్టత ఇస్తారని చెబుతున్నారు.